# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-06-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్ర 16వ శాసనసభాపతిగా నర్సీపట్నం శాసనసభ్యులు సి.హెచ్ అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.**
2. **వర్షాకాలంలో కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా సమగ్ర ప్రణాళికను సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు.**
3. **రాష్ట్రాభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.**
4. **అతిసార వ్యాధి నియంత్రణపై అవగాహన కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది.**
5. **తెలుగు సాహితీ ప్రపంచంలో కరుణశ్రీ అనే కలం పేరుతో ప్రసిద్ధులైన జంధ్యాల పాపయ్య శాస్త్రి వర్ధంతి ఈ రోజు.**

==========================

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు రెండవరోజు ప్రారంభమైయ్యాయి. రాష్ట్ర 16వ శాసనసభాపతిగా నర్సీపట్నం శాసనసభ్యులు సి.హెచ్ అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ఎన్నికను ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్యచౌదరి సభలో అధికారికంగా ప్రకటించారు. అనంతరం ఆయనను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ లు సభాపతి స్థానం వద్దకు తీసుకువెళ్లగా అయ్యన్నపాత్రుడు శాసనసభాపతిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. కాగా నిన్న సాయంత్రం 5గంటలకు నామినేషన్ల ప్రక్రియ ముగియగా ఒకే నామినేషన్ దాఖలైనందున అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

వాయస్ (28) సెకన్స

మరోవైపు ఈ రోజు కూడా శాసన సభ సభ్యుల ప్రమాణ స్వీకారం కొనసాగింది. ఉదయం సభ ప్రారంభమైన తర్వాత నిన్న ప్రమాణం చేయని సభ్యులతో ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రమాణం చేయించారు. పి.సత్యనారాయణ, వి.వెంకటేశ్వరరావు, జీవీ ఆంజనేయులు శాసనసభ్యులుగా ప్రమాణం చేశారు.

--------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన భావాలను దేశ ప్రజలతో పంచుకునే మనసులో మాట మన్ కీ బాత్

కార్యక్రమం 111వ సంచిక ఈ నెల 30వ తేదీన ఆకాశవాణి ద్వారా ప్రసారమవుతుంది. ప్రధానమంత్రిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత జరగనున్న తొలి మన్ కీ బాత్ కార్యక్రమం ఇది. ప్రజలు తమ సలహాలు, సూచనలను ఈ నెల 28 లోగా టోల్ ఫ్రీ నెంబర్ 1800-11-7800కు ఫోన్ చేసి గాని, నరేంద్ర మోదీ యాప్ లేదా మై గౌవ్ ఫోరమ్, ఇతర వేదికల ద్వారా తెలియజేయవచ్చు.

-------------------------

వర్షాకాలంలో కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా సమగ్ర ప్రణాళికను అధికారులు సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. నిన్న వెలగపూడిలో పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా, పురపాలక, వైద్య, ఆరోగ్య శాఖల ఉన్నతాధికారులతో ఉపముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏటా వర్షాకాలంలో వాతావరణం మారే సమయంలో వచ్చే వ్యాధులు గ్రామీణుల జీవన ప్రమాణాలను దెబ్బతీస్తున్నాయన్నారు. తాగునీటి కాలుష్యం మూలంగానే అతిసార వ్యాధి, విష జ్వరాలు లాంటివి ప్రబలుతున్నాయని చెప్పారు. పరిశుభ్రమైన తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు పనిచేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రక్షిత మంచినీటి సరఫరా విషయంలో ఏ మాత్రం అశ్రద్ధ తగదని, ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

-------------------------

తిరుమలలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని ఈరోజు సాయంత్రం పున్నమి గరుడసేవను నిర్వహిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రతినెల పౌర్ణమి పర్వదినాన గరుడసేవను నిర్వహించడం టిటిడికి ఆనవాయితీగా వస్తోంది. ఈరోజు సాయంత్రం ఏడు గంటల నుంచి సర్వాలంకార భూషితుడైన శ్రీ మలయప్ప స్వామి వారు గరుడునిపై తిరుమాఢవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. గరుడసేవను తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టిటిడి తెలిపింది.

-------------------------

సంక్షేమ వసతి గృహాల్లో ఆధునిక మౌలిక సదుపాయాలను కల్పించేలా చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. గత రాత్రి విజయవాడ నగరంలోని ప్రభుత్వ సంక్షేమ బాలుర కళాశాల వసతిగృహాన్ని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేసి హాస్టల్ పరిసరాలను, భోజనశాల, వంట గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో అందిస్తున్న, భోజనం మౌలిక సదుపాయాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల్లో పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. భోజనశాల, వంట గదులను ఆధునీకరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. త్వరలోనే సంక్షేమ వసతి గృహాల్లో ఆధునీకీకరణ పనులు చేపడతామని తెలిపారు

-------------------------

తెలుగు సాహితీ ప్రపంచంలో కరుణశ్రీ అనే కలం పేరుతో ప్రసిద్ధులైన జంధ్యాల పాపయ్య శాస్త్రి వర్ధంతి ఈ రోజు. జంధ్యాల పాపయ్య శాస్త్రి గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలంలోని కొమ్మూరు గ్రామంలో 1912 ఆగస్టు 4న జన్మించారు. జంధ్యాల పాపయ్యశాస్త్రి రచనల్లో కరుణరసం తొణికిసలాడుతూ ఉంటుంది. కరుణ భావ ప్రధానంగా పాపయ్య శాస్త్రి రాసిన పుష్ప విలాపం, కుంతీ కుమారి, తెలుగుబాల వంటి రచనలు ప్రసిద్ధి చెందాయి. సులభమైన శైలిలో, సమకాలీన ధోరణిలో మృదుమధురమైన పద్య రచనా శైలి కరుణశ్రీ

ప్రత్యేకత. ఉదయశ్రీ, విజయశ్రీ, కరుణశ్రీ గ్రంథాలు అనేక సార్లు పునర్ముద్రణ పొంది బహుళ జనాదరణ పొందాయి. కరుణశ్రీగా రచనామృతాన్ని పంచిన జంధ్యాల పాపయ్య శాస్త్రి 1992 జూన్ 22న పరమపదించారు.

-------------------------

రాష్ట్రాభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మంత్రి తొలిసారిగా గుంటూరు జిల్లాకు రాగా టిడిపి నాయకులు స్వాగతం పలికారు. అనంతరం స్థానికంగా పార్టీ వర్గాలు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో మూడు పార్టీల కలయిక రాష్ట్రాభివృద్ధికి దోహదపడనుందని తెలిపారు. రాష్ట్రంతో పాటు గుంటూరు జిల్లా అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతానని పేర్కొంటూ...

వాయిస్ (30) సెకన్స్

-------------------------

అతిసార వ్యాధి నియంత్రణ, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు జూలై 1వ తేదీ నుండి ఆగస్టు 31 వరకు రెండు మాసాల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాన్నినిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ వెల్లడించారు. నిన్న రాష్ట్ర సచివాలయంలో అతిసార వ్యాధి నియంత్రణ అంశంపై సంబంధిత శాఖల అధికారులు, జిల్లా కలెక్టర్లతో దృశ్యమాధ్యమం ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీరబ్ కుమార్ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో గత నాలుగు నెలల కాలంలో గుంటూరు, విజయవాడ, కాకినాడ, జంగారెడ్డిగూడెం తదితర ప్రాంతాల్లో అతిసార వ్యాధి ప్రబలిందన్నారు. అతిసార వ్యాధి నియంత్రణకు యుద్ధ ప్రాతిపదికన కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామ వార్డు సచివాలయాల సిబ్బందిని, ఆశాకార్యకర్తలు, అంగన్ వాడీ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సహకారంతో వ్యక్తిగత పరిశుభ్రతపై ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టాలని నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశించారు.

-------------------------

దేశ రక్షణలో తూర్పునావికాదళ ప్రాముఖ్యాన్ని తెలుసుకునేందుకు లడఖ్ నుండి 30 మందితో కూడిన జాతీయ క్యాడెట్ కార్ప్స్ బృందం విశాఖలో పర్యటిస్తోందని నావికాదళ అధికారులు తెలిపారు. పర్యటనలో భాగంగా 10 రోజుల పాటు నావికాదళ ఓడలు, జలాంతర్గాములు, ఎయిర్ స్టేషన్ల సందర్శన వంటి అంశాలపై బృందం అధ్యయనం చేస్తుందని నావికాదళ వర్గాలు తెలిపాయి. ఇందులో భాగంగా తొలుత నావికాదళ డాక్‌యార్డ్‌లోని అప్రెంటిస్ పాఠశాలను, నావల్ ఎయిర్ స్టేషన్-ఐఎన్ఎస్ డేగాను సందర్శించారు. ఇందులో భాగంగా ఈరోజు అక్కడ వారికి నావికా వైమానిక కార్యకలాపాలు, ఎయిర్ స్క్వాడ్రన్‌లు వివిధ విమానాల గురించి అధికారులు వివరించారు. జాతీయ భద్రత, సముద్ర రక్షణలో భారత నౌకాదళం పాత్రపై అవగాహనను పెంపొందించేందుకు ఈ పర్యటన దోహదపడుతుందని నావికాదళ అధికారులు పేర్కొన్నారు.

-------------------------

రాష్ట్ర గవర్నర్ ముఖ్య కార్యదర్శిగా హరిజవహర్‌లాల్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. కార్మిక, కర్మాగారాలు, బాయిలర్ల శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేసిన ఆయన్ని ప్రభుత్వం రెండు రోజుల కిందట బదిలీ చేసి తాజాగా గవర్నర్ ముఖ్య కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చింది. ఇప్పటి వరకు గవర్నర్ ముఖ్య కార్యదర్శిగా ఉన్న అనిల్‌కుమార్ సింఘాల్ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ అయ్యారు.

====================